# వినాయకచవితి 'కాలమ్ దాటని కథల' పోటీలో ఎన్నికైన కథలు

## భారత్ 'మమ్మీ'

పేరంటంలోనో, మరో శుభ సందర్భంలో మా దగ్గిర బంధువులందరం కలవడం, సరదాగా గడపడం మామూలు. అలాగే ఓ సారి వాళ్ళంతా వచ్చారు.

ఓ రోజు మధ్యాహ్నం కాఫీలయ్యాక అందరం ఒక చోట సమావేశమయ్యాం. పెద్దవాళ్ళ పాటలతో ప్రారంభమైన కాలక్షేపం పిల్లలు వాళ్ల విద్యలు ప్రదర్శించడంలో కొచ్చింది. కొందరు పాపలు పాడారు, కొందరు వచ్చీ రాని డ్యాన్సులు చేశారు. కొందరు కరాటే విద్య చూపించారు. ఒక్కొక్కరి ప్రదర్శన అవగానే చప్పట్లు కొట్టడం ఆ చిన్నారుల లేత ముఖాలు ముత్యాల్లా వెలిగిపోడం. తర్వాత మా తమ్ముడి కొడుకు గోపాల్ సంస్కృతంలో కొన్ని శ్లోకాలు చదివాడు. వాళ్ల తాతగారు రెండేళ్ళ వాణ్ణితన దగ్గరుంచుకుని, రామకృష్ణ మిషన్ స్కూల్లో చదివించారు. సంస్కృతం నేర్పించారు. ఆయన రామకృష్ణ భక్తుడే కాకుండా ఆ మఠానికి ఎంతో సేవ చేశారు. మన ఆర్ష సాంప్రదాయ మంటే ఆయనకు ఎంతో అభిమానం. ఆయన శిక్షణలోనే గోపాల్ అంత చిన్న వయసులో క్లిష్టమైన శ్లోకాలు, ఉదాత్తానుదాత్త స్వరాలతో వేదాలలోకాని బుక్కులా చదివాడు. చదవడం పూర్తికాగానే చప్పట్లు కొట్టి 'బాగా చదివావురా' అన్నారు కాని, గోపాల్ ఆశించినంత ప్రశంస, గుర్తింపు రాలేదు. వాడి మొహం చిన్న బోయింది. తర్వాత మా మేనకోడలుగారమ్మాయి వంతు వచ్చింది. అది కాన్వెంటు దొరసాని. లేచి నుంచుని అభినయం చేస్తూ కొన్ని నర్సరీ రైమ్స్, ఇంగ్లీషు పద్యాలు, అచ్చం ఇంగ్లీషు ఉచ్చారణతో పాడింది. అంతే ఒక్కసారి కరతాళ ధ్వనులు మిన్ను ముట్టాయి. 'ఇంగ్లీషు పిల్లలా పాడానే!' అంటూ అందరూ దాన్ని పొగిడి ముద్దుల వర్షం కురిపించారు.

ఆ సాయంత్రం నేను మేడ గదిలోకి వెళ్లాను. పైన ఎవరూ లేరు. గోపాల్ మాత్రం ఒక్కడూ పెట్టె దగ్గర కూర్చున్నాడు. నేను కుతూహలంతో బాటుగా నుంచుని గమనించాను. వాడు, సంస్కృత శ్లోకాలు అవీ రాసుకున్న నోటు బుక్కులో, ఒక్కొక్క కాగితం తీసి మధ్యకు చింపేస్తున్నాడు. వాడి ముఖంలో తీవ్రమైన అసంతృప్తి! నేను ఏమీ చూడనట్లు వెళ్ళి పలుకరించాను. వాడు కంగారుగా కాగితాలు పెట్టెలో వేసి నా దగ్గర కొచ్చాడు. వాణ్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాను. 'పెద నాన్నా నాకు ఇంగ్లీషు నేర్పిస్తావా?' అన్నాడు దీనంగా నా ముఖంలోకి చూస్తూ' నాకు సంస్కృతం చదవాలని లేదు.'' 'ఓ నీకు సెల్లాళ్లలో బ్రహ్మాండంగా ఇంగ్లీషు నేర్పిస్తాను. సరా!' అని వాణ్ని బుజ్జగించాను: వాడి ముఖం కొంచెం వికసించింది. కాని వాడి మాటలు ములుకుల్లా గుచ్చు కున్నాయి.

ఈ దేశంలో శ్లోకాలు పఠిస్తే మిగిలేది శోకం. వేదాలు వల్లిస్తే కలిగేది నిర్వేదం. సంస్కృతం నేర్చుకోడం పూర్వజన్మ దుష్కృతం! భారత్ 'మమ్మీ'కి విషయం ఎలా చెప్పాలి?

—దేవరకొండ గంగాధర రామారావు

## నాలుగు పాదములు

అప్పారావు అమాయకుడు

ఏ సంగతి అతనికీ తెలుసుకాబోలు అతిగా మాట్లాడటం, శృతిమించి ప్రవర్తించటం వంటి పనులు ఎప్పుడూ చెయ్యడు.

ఆరేడు సంవత్సరాల క్రితం ఆరవ తరగతి ఫెయిల్ కావటంతో విద్యాభ్యాసానికి స్వస్తి చెప్పి వ్యవసాయ రంగంలో ప్రవేశించిన అప్పారావు అమాయకుడే కాని అసమర్థుడు కాదు.

ఎంత పెద్ద పనయినా సునాయాసంగా తనతోటి యువకులందరికంటే తక్కువ కాలంలో చెయ్యగలడు.

బలిష్టమైన కండరాలతో పుష్టిగా వుండే అప్పారావుకి ఎలాంటి పనులైనా అంత లెక్కలోవి కావు.

అయితే దాదాపు చేసే అన్ని పనులలోనూ అతని అమాయకత్వం, తెలివితక్కువ తనం స్పష్టంగా కనిపిస్తుంటాయి.

అందుకే ఆ వూరి వాళ్లందరూ అతన్ని దాదాపు పిచ్చి వాడి క్రిందే జమకడతారు.

అలాంటి అప్పారావుకి పెళ్ళి చెయ్యాలని అతని తల్లిదండ్రులు నిర్ణయించారు.

చాలా కాలం గాలించి గాలించి చివరికి ఒక మంచి సంబంధం తెచ్చారు. ఆ పిల్ల పేరు చంపకమాల.

అప్పారావు పిల్లను చూడకుండానే ఏ కారణం చేతనో ఆ పెళ్ళి తనకొద్దని ఖచ్చితంగా తేల్చి చెప్పాడు.

అప్పారావుకి ఆ వూళ్లోనే సుబ్బారావనే మంచి మిత్రుడున్నాడు. సుబ్బారావంటే అప్పారావుకి ప్రాణం. అందుకే అతని దగ్గర ఎలాంటి విషయాలైనా దాపరికం లేకుండా చెప్పేస్తాడు.

ఆ రోజు ఆ మిత్రులిద్దరూ ఏకాంతంగా మాట్లాడుకోటానికి ఆ వూరి గుడి వెనుక చేరారు.

''పిల్లని చూడకుండానే పెళ్లి వద్దన్నావట ఎందుకని?'' అడిగాడు సుబ్బారావు.

''ఆ అమ్మాయి చంపకమాలట.'' దిగులుగా తల దించుకొని అన్నాడు అప్పారావు.

''అయితే?'' అని సుబ్బారావు ప్రశ్న.

''చంపకమాల నాలుగు పాదములు కలిగి వుండును అని చిన్నప్పుడు తెలుగు పంతులుగారు చెప్పారు గదరా. నాలుగు కాళ్ల అమ్మాయి నాకెందుకు?'' జాలిగా అన్నాడు అప్పారావు.

—మద్దిరాల ప్రసన్న కుమార్

## ఇల్లుకొని చూడు

వామన మూర్తికి పెళ్ళయింది.

స్వంత ఇల్లు కూర్చుకోవడం అతని జీవితాశయం. అతన్ని కదిపితే అతని నోటి వెంట వచ్చే మాట 'ఇల్లు'. అతని తండ్రికిగాని, తాతలకి గాని స్వంత ఇళ్ళు లేవు.

ఉద్యోగం వచ్చిన మరుసటి రోజు నుండి స్వంత ఇంటికోసం ప్రణాళికలు మొదలు పెట్టాడు.

కాని అతనికి పెళ్ళయిన తర్వాత తెలిసింది. తన ప్రణాళికలు ఆలోచనకే పరిమితమని.

కారణం—

ఒకసారి స్ట్రైక్ పీరియడ్‌లో జీతాలు రాక ఇబ్బంది పడుతున్నపుడు పులిమీద పుట్రలా కొడుక్కి జబ్బు చేసింది. ఏభై కాసుల బంగారం ఉన్న అతని భార్యామణి ఒక గాజు తాకట్టు పెడతానని బతిమిలాడినా ఒప్పుకోలేదామె. అప్పు చేసుకోమని చెప్పింది. ఆమెకి బంగారం కావాలి, ఆమె నోరు విప్పితే బంగారం గురించే గోల! చివరికి ఆ పిచ్చే ఇంటిని గుల్ల చేసింది.

ఒక రోజు దొంగలు పడి బంగారాన్ని పట్టుకుపోయారు. ఊరు నుండి వచ్చిన వామనమూర్తి లబోదిబోమన్నాడు. పోలీసు స్టేషను చుట్టూ తిరిగాడు. చివరికి పుస్తెల తాడొకటే దక్కిందని ఆమె చేతిలో పెట్టాడు. అదైనా దక్కిందని కన్నీళ్ళు తుడుచుకుందా ఇల్లాలు!

తర్వాత వామన మూర్తి ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లు మార్చాడు. ఒక మేడలోని చిన్న వాటా తీసుకున్నాడు. ఏం తిప్పలు పడుతున్నాడో కాని తిండికి, గుడ్డకి లోటు లేకుండా భార్యా పిల్లల్ని పోషించాడు.

స్వంత ఇల్లు మాట ఎత్తడం మానేశాడు వామన మూర్తి! బంగారం ఊసెత్త లేదు అతని భార్య!!

పదిహేనేళ్ళ తర్వాత ఒక రోజు అడిగాడు వామన మూర్తి.

'ఈ మేడ మన స్వంతమేనే, నీ బంగారం అమ్మేసి ఈ మేడకొని పెద్ద పోర్షన్ అద్దెకిచ్చాను. అప్పటి నలభై వేల నీ బంగారం విలువ ఈ నాడు లక్షా ఏభై వేలైంది. కాని అప్పుడు నలభై వేలున్న ఈ మేడ ఈ రోజు మూడు లక్షల ఏభై వేలయింది. ఇన్నాళ్ళూ మనకి కలిసొచ్చిన అద్దె ముప్పై ఆరు వేలు. అద్దెకిచ్చిన వాటా వలన ఆదాయం ఎనభై వేలు దాకా వుంది. నీకిప్పుడు ఎంత బంగారం కావాలంటావే' అది విని అతని భార్యకి కోపం రాలేదు. పైగా సంబరపడిపోయింది. 'బంగారం లాటి మీరుండగా ఇంకా బంగారం ఎందుకుట' అంది మురిపెంగా.

—డి.వి.వి. సత్యనారాయణ

ఈ సంచికలో నాకు నచ్చిన కాలమ్ దాటని కథ - - - - - - - - - - - - - - -

రచయిత/రచయిత్రి - - - - - - - - - - - - - - - - - - - - - - - -

పేజీ నంబరు : - - - - - - - - - - - - - - - - - - - - - - - - - -